# జోగుళయ్య

జంగం శెనబసప్పకు ఇద్దరే కొడ్కులు. ఒక్కతే ఆడివిల్ల ఈరమ్మ జంగమోళ్ళల్ల ఆడివిల్ల బరువుగాదు. మను మద్గొచ్చినోళ్లె ఓలి గట్టాలె. ఎంత కల్గిన సంసారమైతె పిల్లోళ్ళకు ఓలి అంత ఎక్కు వొస్తది. పిల్లకు వోలి గూడంగ దీసుకోకుండ పెండ్లి జేసిండు శెనబసప్ప. పెద్దకొడ్కు నాగప్పకు మ్యానపిల్ల శంకరమ్మను జేసింద్రు. చిన్నకొడ్కు ఈరప్పకు ఊళ్లె పిల్లనే శివ్వమ్మ నిచ్చి చేసింద్రు. యా సింత లేకుండ తల్లి అయ్యమ్మ కాజిగె. పింపిణి. వొంకు ఒడ్యాణం బెట్టుకోని రయికెల మీద జరి దిప్పుకుంట గూసుంటది. పెద్దకొడ్కు అడ్తి జూసుకుంటడు. తండ్రితోటిగల్సి. సిన్నకొడ్కుకు బట్టలదుకాణం పెట్టిండు. బ్యారం గీరం బాగనే సాగుతుండది. పొట్ట బట్టకు కరువులేదు. సుట్టం పక్కం ప్యాద సాద వొచ్చుకం పోకం బాగానే జర్గుతుండది. పెద్దోడు నాగప్ప జర కలె గల్పు మణిసి. నగ్లుట గల్సి తిర్గాలె అని అనుకునే టోడు. తల్లి కండ్లల్ల ఎన్నడు వడలేదు గని అప్ప డప్పుడు జెర బంగుకు అలవాటువడ్డ డని పిస పిసలు ఇనవడ్తుండె. ఇగ సిన్నకొడ్కు ఈరప్ప న్యాలము చూసి తీర్గ కిందికి జూసి నడ్సుకుంట ఎవ రన్న కండ్లవడ్డగని ముక్తసరిగ రొండు మాటలు మాట్లాడి తన పని మీదికి తాను బోయె టోడు. ఆ ఇంటికల్ల కాపాయం మనిషి అని పేరుపోయిండు.

అసొంటి ఆ యింట్ల ఓ నాడు ఓ పుండు పుట్టింది. ఉన్న ట్లుండి నాగప్ప గండ్ల వత్త లేడు. మునిమాపైంది రాలేదు. పోనిలే సీకటివడ్డంక

వస్తడని ఊకున్నరు. రా లేదు. పెండ్లాం శివ్వమ్మ అద్దరాత్రి దాంక ఎదురు సూసింది. తెల్లారంగనె శెనబసప్ప శివమ్మా! పెద్దోడొచ్చెనా? అని అడ్గిండు రా లే దన్నది. అందరి ఎదలల్ల రాయి వడ్డది దబ దబ ఇంటెన్కకి వోయి సూసింది తల్లి. యాడ్నన్న ఉరి గిట్ట వోసు కున్నడేమొ నని. తండ్రి ఖాతాబై లన్నీ ముంద లేసోకని పద్దు సద్దు జూస్తుండడు యా దన్న బ్యారంల లిడ్తి వడి మెకం దప్పిచ్చిం డేమో అని. కాదు. లెక్కంత సాఫ్ సీద గండ్ల వడ్డది. అయ్యా! నీవు జెర కోడలమ్మ నడ్గి సూడు, పెద్దోనికి యా ప(?)న్న తప్పుడు తిర్గుళ్ళు ఉండె గిట్టన? అని అంటె మామ మాట ఇన్న శివ్వమ్మ మణుసాల తడ్క దాపునుండె నా ఎర్కల లే దన్నది. ఉమ్మడు మద్గె మూసి, ఊళ్ళ ఉన్న బాయి బాయి అనకుండ జూసిండు. నాగప్ప జాడ యాడ గండ్ల పడలేదు. ఏడ్సిన్రు, మొత్తుకున్నరు. సుట్టాలుపక్కాలంద రొచ్చినుర్రు. ఈ ఇంటికి దిష్టి గొట్టింది. సూడు అయ్యమ్మ ! నీవిట్ల బూమి బడ్తె బసప్ప గతేం గావాలె? కోడల్నెట్ల వట్టాలె? ఎళ్ల బోసుకుంటె ఎత ఎంతన్న ఉండది. ఓపికె వట్టు అని అన్నరు. కొంతమంది. ఇయ్యాళ్ల గాకుంటే రే పొస్తడు. అని దైర్నం బలికి నాల్గు నాళ్లుండి పోయిన్రు. శివ్వమ్మ తండ్రి వొచ్చి. రా! అమ్మ ఇంటికి పోదాం ఈడుండి ఏం జెస్త వన్నడు. నేను రాను నాయిన అత్తమామల గనిపెట్టుకోని, ఈడ్నె ఉంట అని కంట తడి గూడ బెట్టకుండ గట్టిగ వల్కింది. సరె 'నీ యిష్ట' మని తండ్రి రాచప్ప వోయిండు. వొచ్చిన సుట్టాలు ఎక్కడోళ్లక్కడ వోయిన్రు.

నాగప్ప పేరు మర్పున వడ్డది. ముసలి ప్రాణులు అల్ల ముందున్నంత ఉంకు లే కున్నగని శాతనైనట్లు సంసారపు బరువును

మోస్తనే ఉండరు, శివ్వమ్మ సగమైంది. గని పనిపాట, వొంటా, వార్పు అత్తమామలకు యాళ్కాపాళ్కా అన్ని ఎప్పటి తీర్గనె జర్పుకుంట వోతుండది. నాలుగేండ్లు గడ్సినవి. అయిదేండ్లువడ్డవి నాగప్పవోయి. కాలం ఎవరికి జెప్పకుండ ఉర్కుతుండది. అగవట్టేదెవరు?

నాగప్ప ఇప్పుడు నాగయోగి. సచ్చిదానంద మటంల జేరిన సాదు లందట్ల అగ్గి అసొం టోడని పేరు దెచ్చుకున్నడు. గని ఇంగా నాల్గో మెట్టుఎక్కనేలేదు పెద్దగురువు కాళ్లు దొరికిచ్చుకొని ఎంత గీమలినా గని నాగేశ్వరా కింకా ఆజ్ఞరాలేదు. నీ సాధన సరిపోలేదు. 'పుటం పెట్టిందే అసలు బంగారం బయట వడదు నాయిన; తాల్మివట్టు!' అని అనుకుంట వొచ్చిండు గురువు. నిజంగ నాగప్ప పేరుకోసం గని, పెండ్లాం సయిసక గనితల్లిదండ్రి పొట్కెక్కువై గని, అప్పుల బాదవడలేక గని,ఇల్లిడ్సి రాలేదు.

ఆ యాళ్ళ దుకాండ్ల అడ్డిటోకుబ్యారం గుదిర్నంక దినాం కన్న దుకాణం జరె దబ్బున్నె మూసి పైలిసిన నట్లుంటె ఊళ్లె తా నప్పుడప్పుడువొయ్యే మహంతయ్య మటంలకు నడ్సిండు. ఆ యాళ్ల ఆ మటంల కో కొత్తమణిషి వొచ్చిండు. నడీ డుంవొచ్చు. వేదాంతం ల వడ్డరు అందరుగల్సి. సెరిసగంరాత్రి అయింది. పొద్దుదెల్వలేదు గంజాయి నిషల సిసలైన సంతోషపు పొంగున దేల్తుండరు. ఈజన్మరోత, అలివవతెచూలు? ఎవరు?అంతకల్ల ఉన్నదంత ఒక్కటే సచ్చిదానందం. అనుకుంట దోతులు ఎగజెక్కి బాటవట్టిన్రు. తెల్లారెట్యాళ్ళకు బాగ రొండామెడ దూరం నడ్సి వొచ్చిన్రు. అట్లొచ్చి నోళ్ళు మళ్ళా ఓ మటం దేవులాడుకోని, కీసల ఉన్న కాడిక్కె దుల్పి, వొంటా వార్పు జేసొక్కనితిని అల్సటొచ్చి నడుంవాల్సే ట్యాళ్ళకు, కూర్కవట్టింది. కూర్పుదీసి లెసేట్యాళ్ళకు సందె దీపెం

బెట్టిన్రు. మళ్ళా మాపటింతల గంజాయి గొట్టాలు. వేదాంతం. మళ్ళా ఏరూరు పయినం. ఇట్లా అనుకోకుండ ఒనాలు గడ్సినవి. దినం గడ్సిన కొద్ది నాగప్పగట్టిన తెల్లదోతి కాయవారింది. సంచిల సస్కా ఉన్నన్నాళ్లు నాగప్ప జోలె వట్టలేదు. తాను ఇల్లిడ్సి ఆరునెల్ల దినం గా వొచ్చింది. ఇప్పుడు ఇంటికి ఏం మొకం బెట్టుకొని వోతడు? అందుకని నిండ మునిగి నంక సలేంది? అని జోలెవట్టి 'జోగి'ఐండు, యాడ స-దులు మటా ఉంటె అడిక్కవోయి వేదాంతం ఇన్నడు. ఇప్పుడిప్పుడు నిజంగనే నాగప్ప మనుసు వేదాంతం ఒక్కు మళ్లుతుండది. ఇట్ల యాడాది రొండేండ్లు దేశసంచారం జేసి చేసి తా నిప్పుడున్న మఠం జేరుకున్నడు.

ఆ మఠంల తీరొక్క కులపోళ్లున్నరు తీరొక్క గుణపోళ్లున్నరు. పొట్టకు గడువక సన్యాసై నోడున్నడు. రోగంతోన ఏగలేక జోలెగట్టి నోళ్లున్నరు, అప్పులదాడికి మొకం దప్పిచ్చి నోళ్లున్నరు, జేల్ల, కెల్లి పరారై వొచ్చి నోళ్లున్నరు. కూనీలు జేసినోళ్లున్నరు, సోరోళ్లున్నరు ముసలోళ్ళున్నరు. షావుకారిఉన్నడు, సదువుకునోడున్నడు సాకలో డున్నడు, సాగినోడున్నడు. జారి పడ్డోడున్నడు. ఒకరికి అవును ఇంగోళ్లకు గాదు అనకుండ ఆ మటంల అందరికి సోటుంది. అందరికి యోగిబోదలు జేస్తడు. అందరు పనులు జేయాలె. గని వీళ్ళల్ల అంత స్తులు, అంతరా ఉన్నవి. పెద్దయోగి దగ్గర నిజంగ ఎందో పెద్ద మయిమనే ఉండది. లేకుంటె ఆయిన ఎవ్వరికి. ఎన్నడు యా పని జెప్పంగ కండ్ల పడదు. పొద్దుమూకి మట్కు మఠంల ఉన్నో ళ్ళందరు ఒక్కకాడ గూడ్తరు. అందరు గల్సి కండ్లుమూసుకోని. నెత్తులొంచు కోని నాలు

గడియల పొద్దు గూసుంటరు. అటెంక యావో రెండు మాటలు జెప్తడు. అంతే గని. మఠంల పనులు మట్కు ఎక్కడివి అక్కడ జర్గుతవి. ఇండ్లశుద్ధి, తోటపని, వొంట, వార్పు కాణ్ణుంచి సదువూ సందె, లెక్కా పద్దు. అంత సాఫుగ సదుస్తది.

నాగప్ప మఠంల జేరినంక జమ ఖర్చుల పద్దు రాయ మని. ఎవరు జెప్పిన్రో ఎట్ల జెప్పిన్రో తెల్వదు. గని దినాం జిల్కర పోస ప్రమాణం ఏఖతారు రాకుండ లెక్క పద్దులన్ని యా దాని కది రాసి పెడ్తడు. నాగప్ప లేకిడిమనిషి గాడు మనసు శుద్ధి గల్లోడని పెద్దయోగి గుర్తు పట్టిండు మొన్న మొన్న మఠంల కాలుపెట్టిన నాగప్ప ఎట్లెక్కిండో మెట్లు? పెద్దయోగి నిలబడ్డ నాల్గో మెట్టు కింద నిలపడ పట్టిండు. ఈ త్యాప మళ్ళా అడిగిండు; నాగేశయోగి. తనకు సన్యాసం ఇప్పించు మని పెద్దయోగి నిదానంగ మొకంలకు జూసి నాగేశ నీకు పెండ్లి అయిందా? భార్య యుక్తవయస్సుదేనా? తల్లి తండ్రి ఉన్నరా?అని అడిగిండు; అడిగిన మాట లన్నిటికి అవు నన్నట్లు గంగెద్దోలె నెత్తి ఊపిండు. అయితే వాళ్ళను అడిగే ఇల్లు వొదిలి వొచ్చినవా? అని మళ్ళా అడ్గె ట్యాళ్ళకు లే దని తను ఎట్ల ఇల్లు ఇడ్సి ఇందాక జేరిన సంగతి అంత పూసగుచ్చి నట్లు జెప్పిండు. అంత యిన్న పెద్దయోగి నాగేశ ఇప్పుడే నీవు ఇంటికి పోయి నియమంగ వారం గడ్పి వొస్తె, అప్పుడు ఆలోచిస్తాము. అని అన్నడు. అట్లనే అ దెంత పని. నా నిష్ఠ భంగ మెందు కైత దని ఆజ్ఞ దీసుకున్నడు. ఇంటి మొకం బట్టిండు.

ఇల్లు బయి లెల్లిన నాగేశయోగి తోవల గండ్ల వడ్డ పుణ్య స్థలాలు మఠాలు, సాదులు, అందరి దర్శినం జేసుకుంట తన మనసుల ఎసుంటి

సంపు గూడ జొరకుండ చిల్లగిం సిన సీళ్ళ బాయితీర్గ సిండుగ తనూరు లింగమాయ పల్లె జేరిండు. ఆనాటికి తను ఇల్లు ఇడ్సి ఐదేండ్లు ఎండినవి. మళ్ళ అదే మఠంల కొచ్చి దిగిండు నాగేశ యోగి. వొచ్చిన రొండు మూడు గంటలకే ఊరికి పెద్ద జోగుళయ్య వొచ్చిండు. "పదుండి చూసి వొత్తం" అని మంది రావట్టిను. వొచ్చినోళ్లు పాటిచ్చి సూసి పోవడి గనిపెట్టి ఈయన అచ్చం మన శెనబసప్ప పెద్దకొడుకు నాగప్ప తీర్గనే గా నొస్తుండ దని అన్నరు. ఈ మాట ఆనోటఈ నోట వడి శెన బసప్ప కాడికొచ్చింది. ఈ మాట ఇన్న శెనబసప్ప కట్టె ఆసరతోటి లేసి ఇంటున్నావె అని పెండ్లాన్ని కూతవెట్టి పిల్సిండు. వొచ్చింది. అయ్యో మొత్తుకున్నది ఇదేం అన్యాలం అయిపాయె పిల్లగాడు సన్నాసి ఎందుకాయె. పోయి పోయి సన్నాసి రూపులవాణ్ణి నే నెట్ల జూతు. కోడలమ్మ కెట్ల జెప్పుదు? ఏ మని జెప్పుదు? అని, ఓ దిక్కు దుక్కమూ, ఓ దిక్కు పావురం రొండు ముంచుకరాంగ ఆడ్నె కడ్పులల్ల గూలవడ్డది. శెనబసప్ప సన్నాసో, దొరనో! దొంగ నో, బైరాగో. బిచ్చగాడో, ఎవడో ఒగడు కొడుకు. వాడు కండ్లల్ల వడ్తె జాలు. నేను పోయి చూసి వొస్త. అన్నడు. అయ్యమ్మ ఇసి, పిలగా వొచ్చి మఠంల దిగిండు అంటె నా కీడ ప్రాణం నిలవడ్తదా ? ఇంతకు నాగేశయోగి అంటుండరు. రూపు తీరు రూపు ఎందరికి లేదు. మనోడో? కాడో? నీకు ముందే సూ పానదు. నే నొస్త నీఎంట. నే నీడ గడియ నేను అగను. అన్నది. అయ్యో! ఆయింత నేనొచ్చి బాటల సుట్కు పడేవు. బండి విఋపిస్త, అని పక్కకే పాటకుల ఉన్న తిప్పణ్ణను పిల్సి బంకి గట్టు మన్నడు. తిప్పణ్ణ బండి తెచ్చేదే

ఆలెస్యం. బిర బిర వోయి అయ్యమ్మ బసప్ప బిగళ్ళను అనుకోని బిగళ్ల హా హా అనుకుంట గూట్లె గువ్వ లోలె గూసున్నరు. బండి నడ్సింది.

అమఠం సుట్టు మంది గూడిన్రు. కొంత మంది అవునంటున్నరు. కొంతమంది కా దంటున్నరు. గని ఎవ్వరికి దగ్గెరికి వోయి నాగేశయోగి గివి నీ పెసరు! అని పల్కరిచ్చేదమ్ము లేదు. అప్పుడే సిన్న సన్న బైరాగులు సుట్టు జేర్తున్నరు మఠం మహాంతు పండ్లు ఫలాలు సర్వరాయి సాగిచ్చిండు సాయింత్రం పలాకి సేవ దీస్తరు. రేపటి నుండి ఇంటింట పాదపూజలు జేస్తరు. చెత్రి. శౌరి. దెప్పిచ్చిన్రు ఎండికోళ్లు ఎత్తుపీట ఏర్పాటైంది ఇప్పటికి మాత్రం నాగేశయోగి సిరిసాపమీద కూసున్నడు కాళ్ళు దొరికితే సాలు, కైలాసం బోత మని మంది ముందుకు ఇర్గవడ్తుండరు.

కాళ్లు ముట్టి దండం బెట్టొద్దు. మా గురువు ఆజ్ఞ. దూరం నుండె నమస్కారం జేయుండి అన్నడు, యోగి. అహా ! ఈ మానుభావుని పాద ధూళికి నోసుకోవద్దా అందరు? అని జనం తట పటాయించవట్టిన్రు ఇంతట్లనె అడున్న జనం నడుంగల కెల్లి వొణుక్కుంట ముసలో శ్నిద్దరు ముందుకు వోయిండ్రు. సూ సేది సూడంగనే తల్లి అయ్యమ్మ. కొడుకా! నాగప్పా! ఎంతపని జేస్తివి తండ్రి. ముసలి ప్రాణాలను పడ్సు పెండ్లాన్ని ఏం జేత మనుకునవ్? తండ్రీ! అను కుంట సొమ్మసిల్లి పడ్డది. నాగేశయోగి విభూతి పెట్టి అయ్యమ్మమలేపి కూసోపెట్టిండు. నాయనా! ఒక్కసారి ఇంటికిరా! తండ్రి! పెద్దోణిచేతులు జోడిస్తుండ జోగుళయ్యలు ఎందరు మన ఇంటికి రాలేదు ? నీ కట్టుబాటు తప్పకుండ నడ్సుకుంటం అన్నడు బసప్ప. అందయి చేతులు జోడిచ్చ

కోని రామపట్టాభిషేకం బొమ్మల కోతులోలెనిలవడ్డరు. సరే అనుకుంట తన బిఛానా తంౘ్రడి ఇంటికి మార్శింను. నాగేశయోగి.

వచ్చిన కాణ్ణుంచి ఊరు ఊరి నుండి భక్తులు. బైరాగులు. సుట్టాలు, యోగి ఇంటికితమాస సూసి పొయ్యేటోళ్ళు తోన శెనబసప్ప ఇల్లు శివునిగుడి ఐంది. తల్లి తంౘ్రడి కొడ్కును ఇడ్వకుండ చెరో దిక్కు కొంత దూరానగూసున్నం మొదలు బెట్టిన్రు. కోడలు శివ్వమ్మ పని పా పైనంక వొచ్చి తలుపు పట్టుకోని నిలవడి నాగప్పను జూసిపోతది. అంతే దగ్గ రికి వో లేదు. ఏడ్వలేదు. నగలేదు. ఏగిర్త వడలేదు. వొణ్కలేదు. సెమటవట్టలేదు. పొద్దుమూకి మట్కు ముద్దుగ నెత్తి దువ్వుకొని మల్లె పూలు శికెల ముడ్సుకోని దోసపట్కు బొట్టు పెట్టుకుంటది. నాగప్ప గూసున్న అరుగు ఎదురుగ ఉన్న రొండో అర్గును అల్కి శుద్ధిజేసి ముగ్గేసి అరటిఆకు వర్సి రాగి చెంబుల నీళ్లు పెట్టి. దానిమీద స్తాళి బోర్లిచ్చి పోతది. బంకుల కింద కాళ్లు చేతులు గడ్కోనికె. నీళ్ళు కొప్పెర పెట్టి పోతుండె. ఒగనాడైంది రొన్నాళ్లైనవి. నాగప్ప లోన యా మార్పు లేదు. పెండ్లాన్ని కన్నెత్తి గూడ సూడలేదు. మూడో నాడు బసప్ప అయ్యమ్మను నడింట్లకు పిల్సి పిలగాడు ఏమంటుండడు? అని అడిగిండు. ఆ మాటకు అయ్యమ్మ ఆఁ ఏమంటడు ఎద్దోలె దిని మొద్దోలె వండు తుండడు. ఆ సొర్సేలేదు. దాని రాత అని నెత్తిగొట్టుకున్నది. ఇద్దరు అలుమొగుండ్లు ఏమనుకున్నరో ఏమో గని వొంటింట్లకు వోయి కోడ లమ్మతోటి యాదో జెప్పి మెల్లగ సేతి సంచిల సామాను సర్దుకొని ఎవ్వ రికి జెప్పకుండ దిడ్డిదరువాజ నుండి దాటి అవతల వడ్డరు.

పొద్దుమూకి ఎప్పటితీర్గ భోజనం వొడ్డిచ్చి కాన్రికుండ వోయింది శివ్వమ్మ. నాగప్ప కుయ్ కయ్ మనకుండ సాపాటు జేసిండు. నడుం వాల్చిండు. గని. నాగప్పకు నిద్రపట్టలేదు. ఉడ్కపోసింది. తాటాకు ఇస్నకార చేతవట్టి ఇసురుకున్నడు ఉడ్కపోత గాదు, దూపైంది. మంచితీర్తం దా గాలె అనుకున్నడు. నాగప్ప ఇల్లు ఒంటిశాల భవంతి ముందల దూలాల సందున చిల్కచెక్క సదిరి కప్పును గచ్చుజేసిన అర్గులుండవి. ఆ అర్గులకు రొండు దిక్కుల సుట్టాలు సామాను పెట్టుకోనికె తనబ్బిలుండవి. అడ్నె నాగప్ప దిగిండు, ఎవరో సుట్టమోలె. ఈ అద్దమ్మ రాత్రి నాగయోగికి దూపైతాను పడ్కజేసిన అర్గ తన ఎదురు అర్గ రొం డరుగులను ఆ కొన నుండి ఈ కొన దాంక అంత పార జూసిండు. నీళ్ళసెంబు యాడ గాన్రాలేదు. అమ్మ నాయిన ఉన్నట్లు లేదు. సీకట్ల గుడ్డిదీపం మిన్కు మిన్కు మంటుండది. మెల్లగ లేసిండు. తెల్సిన ఇల్లే గన్క, అర్గదిగి నడింటి కడ్పలల్ల నిలవడి తలుపుగొట్టు కుంట అమ్మా ! లోపట ఎవరుండరు ? నాకు కొంచెం మంచి తీర్తం ఇప్పిస్తరా ? అని అడ్గిండు. నాగేశయోగి గొంతు యిన్న శివ్వమ్మ లేసి వొచ్చి ఎదురుగ నిలపడ్డది. శివ్వమ్మ నెత్తిల పెట్టుకున్న మల్లెమొగ్గ లన్ని ఇప్పుకున్నవి. ఆ పూల వాసన నాగయోగి ముక్కుపుటాల నుండి జొరవడి ఎకా ఎకి నడినెత్తి దాంక ఎగబాకింది. నాగయోగి మొదటి సారి బంగు దాగినట్లు యాడికోవోతుండడు. గని అంతట్లకె సంబాళిచ్చు కొని, గంబీరంగ "మంచి తీర్తం యిప్పిస్తరా" అని అడ్గిండు. శివ్వ మ్మకు నగొచ్చింది. గని గాన్రాకుండ "ఏయ్ బైరాగోడ ! మా యత్త మామ ఇంట్ల లేంది జూసి మంచి తీర్తం గించి తీర్తం అనుకుంట ఇంట్ల

జొరవడ జూస్తుండవా?" అన్నది. "శివా! అట్లనకు. యోగులను సేవిస్తే తప్పులేదు;" అన్నాడు. సరే అన్నట్లు ఆ డున్న మంచి నీళ్ల బిందెల కెళ్ళి మిళ్ళిల వొంచి చేయి ముందలికి జాపి పట్టుకోని నిలవడ్డది. "శివా! నీవు అదృష్టవంతురాలవు. నిన్ను అనుగ్రహాయించ వలె నని కోరిక కలుగుతున్నది" అన్నాడు. "ఏమో? శివ్వ గివ్వ అనవద్దువి. నీకు నన్ను అనుగ్రయించాలని కోరిక పుట్టె బాగనే వుట్టింది. గని, మరి నిన్ను నేను అనుగ్రయించొద్దా?" అని అన్నది. "శివా! స్వాముఁను వాళ్ళ కోర్కెను కాదనకు" అన్నాడు. "అవు నవును. గా యింత దానికి సన్నాసి గిన్నాసి నని దొంగ ఏశం ఎందుకు గట్టాలె? నా కెర్కె. గంజాయి రుచి మర్గి ఇల్లిడ్సి పోయినవ్ గని. లేకుంటె నీ వేంది? జోగుళయ్య తన మేంది? ఎన్నా శ్ళకున్న నీ వొస్తపు. మళ్ళ కాపిరం జేస్తవని నా కెర్కె" అని అంటున్న శివ్వమ్మ మాటలు నాగయోగి చెవులకు యినవడనే లేవు. ఆయిన సూపంత శివ్వమ్మ మీదనే గురి గుదిరిచ్చు కున్నదీ. అంత కంతకు నాగేశయోగికి ఉడ్కపోత ఎక్కువైంది. పై అంత సల సల మసిల్నట్లని పిస్తుండది. శివ్వమ్మ ఎదుటి నుండి దాటి అవుతలికి గదిలె సత్తువ గూడ బైరాగి వొంటిల లేనట్లనిపిచ్చింది. మేనక ముందల నిలవడ్డ విశ్వామిత్రుని తీర్గ చెదరిపోతుండడు యోగి. శివ్వమ్మ కే పాపం అనిపిచ్చింది. మొగణ్ణి వోరగండ్ల జూసుకుంట. "సరె గని మళ్ళా నన్ను ఇడ్సి బక్తి అని. బైరాగు లని, సన్నాసు లని, సాదులని పో నని వొట్టువెట్టుకో, ముందు ఈ బుట్టకాయె పలగ్గొట్టు. ఆ జోలె ఇక్కడియ్యి" అని యాదో యాదికొచ్చినట్లు బిర బిర నడ్సుకుంట దేవుని ఇంట్లకు వోయి లింగంకాయ దెచ్చి మెళ్ళేసింది. యీబూతి పండు దెచ్చి సేతి

కిచ్చి, తన నిడ్పి కదుల నని బాస జేయ మన్నది. శివ్వమ్మ జెప్పినట్లు నాగేశయోగి గంగెద్దోలె నెత్తి ఊపుతుండడు. దారం గుంజి నట్లల్ల బొమ్మాడి నట్లు ఆడుతుండడు యోగి, అంతట్లనె ముసి ముసి నగులు నగు కుంట శివమ్మ నాగేశయోగి చెయ్యి వట్టి ఇంట్లకు గుంజుకోని గడేసింది.

తెల్లారంగనె మంగలి సీనడొచ్చిండు. నాగప్పకు గడ్డాలుమీసాలు గత్తిరిచ్చి ముందున్నట్లు జేసిండు. ఇంటెనక శివ్వమ్మ కొప్పెర్ల కొద్దికి నీళ్ళు గాగవెట్టింది. కూకుడుగాయలు గొట్టింది. నూనెగాసి నెత్తి అంటింది ఇన్నాళ్ళ కర్వు ఇర్గ ఉడుకు నీళ్ళు వోసింది. నాగప్ప కిష్ట మైన నూగువిండి కారం జేసింది. ఉల్లిగడ్డ గొజ్జుపులుసు జేసింది. నింపుడుగాయె వొండింది. చిత్రాన్నం జేసింది. ఎన్నపూసకాగవెట్టి నెయ్యి నేతిపావుల వోసింది. ఎన్నాళ్ళ నుండో మూలకున్న తమలపాకు బుట్టి దుపిలి ఆకులు దెప్పిచ్చి కడిగి పెట్టింది. తాను దబ దబ శివార్చన గిన జేసుకోని నాగప్పకు వొడ్డన జేసింది. నాగప్ప బోంచేసి చేతులు గడు క్కోని పెండ్లాం మడ్సి ఇచ్చిన ఆకు నములుకుంట బంకుల్ల కొనాకు గూసున్నడు. ఇంతట్లనె అయ్యమ్మ, బసప్ప, పర్వతం జూడవోయిన తమ్ముడు ఈరప్ప, ఈరప్ప పెండ్లాం శంకరమ్మ అంతా ఒక్కసారె దిగిన్రు. దిగె టాళ్ళకు ఎదురుగ నాగప్ప ఎప్పటోలె గండ్ల వడ్డడు. నాగప్పమట్కు తప్పు జేసి నోనివోలె మొకం జెర కిందికి దించుకోని తల్లి దండ్రికి దండం బెట్టిండు. అయ్యమ్మ పొత్తిలకొడ్కును ముద్దాడినట్లు రొండు చెంపలు వట్టి ముద్దిచ్చుకున్నది నాగప్పను. యారండ్లిద్దరు ఇంట్లకు నడిసిన్రు.